4 సిట్టింగ్‌లకే..

బీఆర్‌ఎస్ అభ్యర్థుల జాబితా వెల్లడి



- ఉప్పల్‌లో మాత్రం బండారి లక్ష్మారెడ్డి ఖరారు
- ఆశావహులకు తప్పని భంగపాటు.. పక్కచూపులు చూస్తున్న నేతలు
- తనయుడు జెడ్పీ చైర్మన్ కావడంతో.. డైలమాలో మాజీ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి
- మేడ్చల్ టికెట్‌పై హామీ ఇస్తే కాంగ్రెస్‌కు మారే అవకాశం..!
- వ్యతిరేక చర్యలకు పాల్పడితే వేటు తప్పదని అధినేత హెచ్చరిక

సాక్షి, మేడ్చల్ జిల్లా: అధికార బీఆర్‌ఎస్ ముందస్తుగా అభ్యర్థుల జాబితాను సోమవారం ప్రకటించింది. మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో మొత్తంగా ఐదు అసెంబ్లీ నియోజకవర్గాలు ఉండగా, వచ్చే ఎన్నికల్లో పోటీకి ఉప్పల్ సెగ్మెంట్ మినహాయించి మిగతా మేడ్చల్, మల్కాజిగిరి, కూకట్‌పల్లి, కుత్బుల్లాపూర్ అసెంబ్లీ నియోజకవర్గాల్లో మళ్లీ సిట్టింగ్ ఎమ్మెల్యేలకే అవకాశం కల్పించారు. దీంతో మరో రెండు అసెంబ్లీ నియోజకవర్గాల్లో కూడా అభ్యర్థులను మార్చనున్నారనే రాజకీయ వర్గాల ఊహాగానాలకు తెరపడినట్లయింది. అధిష్టానం ప్రకటించిన ఎమ్మెల్యే అభ్యర్థుల్లో నలుగురు ఓసీ సామాజిక వర్గానికి చెందిన వారు కాగా, ఒకరు మాత్రమే బీసీ సామాజిక వర్గానికి చెందిన వారు ఉండటం విశేషం. ఇదిలా ఉంటే గతకొంత కాలంగా ఎమ్మెల్యే టికెట్‌పై ఆశలు పెంచుకున్న మాజీ ఎమ్మెల్యే మలిపెద్ది సుధీర్‌రెడ్డి, ఎమ్మెల్సీలు శంభీపూర్ రాజు, నవీన్‌రావు, మాజీ మేయరు బొంతు రామ్మోహన్ ఆశావహులకు ఈ సారి కూడా నిరాశే మిగిలింది. మళ్లీ టికెట్ లభించగలదని ఆశ పడిన ఉప్పల్ సిట్టింగ్ ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డికి అధిష్టానం మొండి చెయ్యి చూపింది. తండ్రుల స్థానంలో తనయులు చామకూర మహేందర్‌రెడ్డి, మైనంపల్లి రోహిత్‌లు పోటీ చేయాలని భావించినా భంగపాటు తప్పలేదు.

ఆశావహులకు భంగపాటు

మేడ్చల్ నియోజకవర్గం నుంచి మాజీ ఎమ్మెల్యే మలిపెద్ది సుధీర్‌రెడ్డి టికెట్ ఆశించినా భంగపాటు తప్పలేదు. గత ఏప్రిల్ మాసంలో బీఆర్‌ఎస్ ఆత్మీయ సమ్మేళనాలు నిర్వహించిన సందర్భంలో సిట్టింగ్ ఎమ్మెల్యే, మంత్రి మల్లారెడ్డి, మాజీ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి అధినేతల సమక్షంలోనే వాగ్వాదాలు, తోపులాటలకు దిగిన విషయం తెలిసిందే.. మేడ్చల్ నుంచి మళ్లీ బీఆర్‌ఎస్ అభ్యర్థిని తానేనని పలు ఆత్మీయ సమ్మేళనాల్లో ప్రకటించటంతోపాటు మాజీ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డితో సహా ఆయన తనయుడు జెడ్పీ చైర్మన్ మలిపెద్ది శరత్‌చంద్రారెడ్డి ఆహ్వానించకపోవడం వంటి విషయాల నేపథ్యంలో ఇరువురి మధ్య విభేదాలు పొడచూపినట్లు పార్టీ వర్గాల్లో చర్చ సాగింది.

పార్టీ వ్యతిరేక విధానాలకు..

బీఆర్‌ఎస్ అభ్యర్థులను ప్రకటించిన అధిష్టానం.. జిల్లాతో సహా నియోజకవర్గాల్లో నాయకులు, కేడర్ అంతా కలిసికట్టుగా పనిచేయాలని ఆదేశించింది. అలా కాకుండా.. పార్టీ వ్యతిరేక చర్యలకు పాల్పడితే వారు ఎంతటి వారైనా సరే ఉపేక్షించే ప్రసక్తే లేదని ఆ పార్టీ అధినేత కేసీఆర్ హెచ్చరించడం వంటి విషయాలు కూడా పార్టీ వర్గాల్లో తీవ్ర చర్చనీయాంశం అవుతున్నాయి.

మిగతా నియోజకవర్గాల్లోనూ..

కుత్బుల్లాపూర్ నుంచి ఎమ్మెల్సీ, జిల్లా పార్టీ అధ్యక్షుడు శంభీపూర్ రాజు టికెట్ ఆశించారు. అలాగే, కూకట్‌పల్లి నుంచి మరో ఎమ్మెల్సీ నవీన్‌రావు కూడా టికెట్ ఆశించి భంగపడ్డారు. వీరిలో ఏ ఒక్కరిపై కూడా అధిష్టానం మొగ్గు చూపకపోవడం విశేషం. పార్టీ కోసం కష్టపడి పని చేసినా.. ప్రాధాన్యత ఇవ్వకవడంతో వారంతా అధిష్టానంపై గుర్రుగా ఉన్నారు. అవకాశం కోసం కొందరు పక్క చూపులు చూస్తున్నారు. వీరిలో మాజీ ఎమ్మెల్యే మలిపెద్ది సుధీర్‌రెడ్డి బీఆర్‌ఎస్‌ను వీడే అవకాశం ఉన్నట్లు రాజకీయ వర్గాల్లో చర్చ సాగుతోంది. అయితే తనయుడు మలిపెద్ది శరత్ చంద్రారెడ్డి జెడ్పీ చైర్మన్‌గా కొనసాగుతుండటం వల్ల పార్టీ మారే విషయంపై మాజీ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి డైలమాలో ఉన్నట్లు తెలుస్తోంది. పైగా కాంగ్రెస్ పార్టీ మేడ్చల్ టికెట్ ఇస్తానని హామీ ఇచ్చినట్లయితే కూడా.. బీఆర్‌ఎస్‌ను వీడే అవకాశమున్నట్లు ప్రచారం జరుగుతోంది.

ఏ నియోజకవర్గంలో ఎవరంటే..?

మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో ఐదు అసెంబ్లీ నియోజకవర్గాలు ఉండగా, ఇందులో నాలుగింటిలో మళ్లీ సిట్టింగ్ ఎమ్మెల్యేలకే అధిష్టానం అవకాశం కల్పించింది. సిట్టింగ్ స్థానాలైన మేడ్చల్ నియోజకవర్గం నుంచి మంత్రి చామకూర మల్లారెడ్డి, కుత్బుల్లాపూర్ నుంచి కేపీ వివేకానందగౌడ్, కూకట్‌పల్లి నియోజకవర్గం నుంచి మాధవరం కృష్ణారావు, మల్కాజిగిరి నియోజకవర్గం నుంచి మైనంపల్లి హన్మంతరావును బీఆర్‌ఎస్ అభ్యర్థులుగా అధిష్టానం ప్రకటించింది. ఉప్పల్ నియోజకవర్గంలో మాత్రం బండారి లక్ష్మారెడ్డినికి అభ్యర్థిగా ఖరారు చేసింది. గత అసెంబ్లీ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ నుంచి బీఆర్‌ఎస్‌లో చేరిన బండారి లక్ష్మారెడ్డికి ముఖ్యమంత్రి కేసీఆర్ ఇచ్చిన మాటను నిలబెట్టుకున్నారన్న చర్చ ఆయన అనుచర వర్గాల నుంచి వ్యక్తమవుతోంది. జిల్లాలో నాలుగు నియోజకవర్గాల్లో మళ్లీ సిట్టింగ్ అభ్యర్థులకే టికెట్లు ప్రకటించి, అందరినీ ఆశ్చర్యంలో ముంచేశారు. ఎన్నికలకు మరో మూడు మాసాల గడువు ఉండగా, అభ్యర్థులను ప్రకటించడం రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది.

మల్కాజిగిరి నియోజకవర్గం



పేరు: మైనంపల్లి హన్మంతరావు
తండ్రి: ఎం.కిషన్‌రావు, సరోజిని
వయస్సు: 57 భార్య: మైనంపల్లి వాణీ
కుమారులు: రోహిత్, శివాంక్
నివాసం: అశోక బిల్డర్స్ దూలపల్లి, మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా
జననం: 1966 జనవరి 10 కొర్విపల్లి మెదక్ జిల్లా

2014 పార్లమెంట్ ఎన్నికల్లో మల్కాజిగిరి పార్లమెంట్‌కు టీఆర్‌ఎస్ తరఫున పోటీ చేసి తన సమీప టీడీపీ అభ్యర్థి మల్లారెడ్డిపై ఓటమిపాలయ్యారు. 2015లో టీఆర్‌ఎస్‌కు గ్రేటర్ అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. 2017లో ఎమ్మెల్యే కోటాలో ఎమ్మెల్సీగా ఎన్నికయ్యారు. 2018లో మల్కాజిగిరి నియోజకవర్గం నుంచి టీఆర్‌ఎస్ అభ్యర్థిగా పోటీ చేసి తన సమీప బీజేపీ అభ్యర్థి ఎన్.రాంచందర్‌రావుపై 73,698 ఓట్లతో గెలుపొందారు.

ఉప్పల్ నియోజకవర్గం



పేరు: బండారి లక్ష్మారెడ్డి
పుట్టిన తేదీ: 27 నవంబర్ 1967, వయస్సు 56 సంవత్సరాలు
మతం: హిందూ, ఓసీ- రెడ్డి
అడ్రస్: బీ-2, సైనిక్‌పురి, కాప్రా మున్సిపాలిటీ, మేడ్చల్- మల్కాజిగిరి జిల్లా.
కుటుంబం: అమ్మ లక్ష్మమ్మ, నాన్న జంగారెడ్డి
భార్య: మమత రెడ్డి, పిల్లలు: అఖిల్ రెడ్డి, అలేఖ్య
వృత్తి: వ్యాపారం

- బీఎల్‌ఆర్ చారిటబుల్ ట్రస్టును 2014లో ఏర్పాటు చేసి ట్రస్టు ద్వారా సేవలు అందిస్తున్నారు.
- ఉమ్మడి రాష్ట్రంలో పీసీసీ ప్రధాన కార్యదర్శిగా పనిచేశారు. జేఎన్‌టీయూ పాలక మండలి సభ్యుడిగా పని చేశారు. మాజీ ఎమ్మెల్యే బండారి రాజిరెడ్డికి స్వయాన సోదరుడు.
- 2014లో ఉప్పల్ నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా నుంచి పోటీ చేసి ఓటమి పాలయ్యాడు.
- 2018 అసెంబ్లీ ఎన్నికలకు ముందు టీఆర్‌ఎస్‌లో చేరాడు.
- పార్టీ టికెట్ కోసం ముమ్మర ప్రయత్నాలు చేశాడు. సీటు దక్కకపోవడంతో అధిష్టానం ఆదేశాల మేరకు ఉప్పల్ టీఆర్‌ఎస్ అభ్యర్థి బేతి సుభాష్‌రెడ్డికి మద్దతుగా ప్రచారం నిర్వహించి గెలుపునకు కారణమయ్యాడు. అప్పటి నుంచి ఇప్పటి వరకు బీఎల్‌ఆర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ ప్రజలతో మమేకమయ్యాడు.

క్లుప్తంగా...

నేడు పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన

బోడుప్పల్: బోడుప్పల్ నగర పాలక సంస్థ పరిధిలో మంగళవారం పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్నట్లు మేయర్ సామల బుచ్చిరెడ్డి ఒక ప్రకటనలో వెల్లడించారు. రూ.2 కోట్ల వ్యయంతో 10 డివిజన్లల్లో సీసీ రోడ్లు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ శంకుస్థాపన పనులు చేపట్టనున్నట్లు వెల్లడించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మంత్రి చామకూర మల్లారెడ్డి హాజరవుతున్నట్లు తెలిపారు.

ఘనంగా ఎల్లమ్మ కల్యాణం

రామంతాపూర్: కురుమ సంఘం ఆధ్వర్యంలో కామరాజు బీరప్ప స్వామి దేవాలయ వార్షికోత్సవంలో భాగంగా రేణుక ఎల్లమ్మ కల్యాణ మహోత్సవం కన్నులపండువగా సోమవారం నిర్వహించారు. అనంతరం గణపతి విగ్రహ ప్రతిష్ఠ చేశారు. కార్యక్రమంలో రామతాపూర్ కార్పొరేటర్ బండారు శ్రీవాణి వెంకట్‌రావు, కురుమ సంఘం నేతలు రేవు కృష్ణయ్య, రావుల బీరప్ప, శేఖర్, రవి, రేవు నరసింహ, భిక్షపతి, మల్లయ్య, యాదయ్య, ఆగమయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆలయ పునర్నిర్మాణం ప్రారంభం

రామంతాపూర్: రాంరెడ్డినగర్‌లోని పోచమ్మ దేవాలయం పునర్నిర్మాణం పనులను సోమవారం స్థానిక యువజన సంఘాల అధ్యక్షుడు గడ్డం సాయి కిరణ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ దేవతలు ఆరాధిస్తే అన్ని శుభాలే జరిగి దుష్టశక్తులు దూరం అవుతాయన్నారు. అనంతరం ఆయన రూ.11 వేలు చెల్లించి ఆలయ సభ్యత్వం తీసుకున్నారు. కార్యక్రమంలో సంక్షేమ సంఘం అధ్యక్షుడు సత్యనారాయణగౌడ్, గౌరవ అధ్యక్షుడు పెంటపల్లి వెంకన్న పటేల్, ప్రధాన కార్యదర్శి కొత్తూరు శ్రీనివాస్, కోశాధికారి నాగరాజు యాదవ్, సభ్యులు రాములు, అశోక్, లక్ష్మణ్, రఘుపతి, రాజు, బాలయ్య, రాజారాం, మల్లేష్, కొమురయ్య, శాంతి కుమార్, స్వామి, సుధాకర్, అనిల్‌గౌడ్, సిద్ది రాజు, గడ్డం వెంకట్ సాయి తదితరులు పాల్గొన్నారు.

అన్నపూర్ణ కిచెన్ ప్రారంభం



బోడుప్పల్: బోడుప్పల్ నగర పాలక సంస్థ పరిధిలో ఏర్పాటు చేసిన అన్నపూర్ణ కిచెన్‌ను సోమవారం మేయర్లు సామల బుచ్చిరెడ్డి, జక్క వెంకట్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భోజన ప్రియులకు నాణ్యమైన, రుచికరమైన వంటలను లాభాపేక్ష లేకుండా అందించాలని సూచించారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

ఉప్పల్: ఉప్పల్ 11 కేవీ ఫీడర్ మరమ్మతుల కారణంగా మంగళవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు సర్వే ఆఫ్ ఇండియా, కేంద్రీయ విద్యాలయ-1, వెంకటేశ్వర కాలనీ, రాజ్ నగర్ కాలనీలో విద్యుత్ సరఫరా ఉండదన్నారు. 11కేవీ విజయపురి కాలనీ ఫీడర్ మరమ్మతుల కారణంగా మధ్యాహ్నం 2 గంటల నుంచి 5.30 గంటల వరకు విజయపురికాలనీ, సాయిరాం కాలనీ, సాయిబాబా కాలనీ, హెచ్‌ఎండీఏ, భగాయత్ తదితర ప్రాంతాల్లో సరఫరా ఉండదని ఏఈ కిరణ్ తెలిపారు.

మల్లాపూర్‌లో..

మల్లాపూర్: నోమా సబ్‌స్టేషన్, సూర్యనగర్ 11కేవీ ఫీడర్ పరిధిలో మంగళవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు సూర్యనగర్, ఉదయ్‌నగర్, బ్యాంక్ కాలనీ, గణపతి దేవాలయం, మల్లికార్జున్‌నగర్, శక్తి సాయినగర్, వెంకటరమణ కాలనీ జేఎస్ఎస్ ఎయూఆర్‌ఎం కాలనీలో విద్యుత్ అంతరాయం ఉంటుందని విద్యుత్ ఏఈ తెలిపారు. ఏపీ కాలనీ 11 కేవీ ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు వీఎస్ఆర్ గార్డెన్, శ్రీనివాస్ నగర్, మైప్లర్ పార్క్, జనప్రియ టౌన్‌షిప్, లింగయ్య కాలనీ, శివ హోటల్ ప్రధాన రహదారిలో విద్యుత్ సరాఫరాను నిలిపివేస్తున్నట్లు తెలిపారు.

బీసీలకు అన్యాయం చేసిన కేసీఆర్


విక్రమ్‌గౌడ్

అల్వాల్: సీఎం కేసీఆర్ సోమవారం ప్రకటించిన 115 ఎమ్మెల్యేల సీట్లలో బీసీలకు కేవలం 23 సీట్లు ప్రకటించడం అన్యాయమని బీసీ విద్యార్థి సంఘం కేంద్ర కమిటీ అధ్యక్షుడు విక్రమ్‌గౌడ్ ప్రశ్నించారు. సోమవారం ఆయన మాట్లాడుతూ 60 శాతం ఉన్న బీసీ జనాభాకు కేవలం 20 శాతం సీట్లు కేటాయించడం ఎంతవరకు సమంజసమని ఆయన పేర్కొన్నారు. అర శాతం, రెండు, మూడు శాతం ఉన్న వారికి 60 శాతం టికెట్లు ప్రకటించడం సామాజిక న్యాయాన్ని బొందపెట్టినట్లేనని ఆయన తెలిపారు. రాష్ట్రంలో 95 శాతం బడుగు, బలహీన వర్గాలు ఉన్నారని అనేక సభల్లో చెప్పిన కేసీఆర్‌కు టికెట్ల కేటాయిపులో వారు గుర్తుకు రాలేదా అని ప్రశ్నించారు.

ఓటర్లు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి

బోడుప్పల్: ఓటర్ నమోదు నియమాల 1960 ప్రకారం ఎలక్టోరల్ రోల్ తయారు చేసి దాని ముసాయిదాను కార్యాలయంలో ప్రజలకు అందుబాటులో ఉంచినట్లు బోడుప్పల్ కమిషనర్ జి. వేణుగోపాల్‌రెడ్డి వెల్లడించారు. బోడుప్పల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ముసాయిదా ప్రతులను కార్యాలయంతోపాటు నిర్దేశించిన పోలింగ్ స్టేషన్ భవనాల వద్ద ఈనెల 21వ తేదీ నుంచి అందుబాటులో ఉన్నాయన్నారు. ఓటర్ల జాబితా తయారీకి అర్హత తేదీ 2023 అక్టోబర్ 1వ తేదీ అని రోల్‌లో పేరు చేర్చడానికి, ఏదైనా క్లైయిమ్, పేరు చేర్చడానికి ఏదైనా అభ్యంతరం, ఏదైనా ఎంట్రీలో వివరాలపై అభ్యంతరం ఉంటే ఈ నెల 21వ తేదీ నుంచి సెప్టెంబర్ 19వ తేదీలోపు దాఖలు చేయాలన్నారు. ఏవైనా అభ్యంతరాలు ఉంటే ఫారం 6, 7, 8లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అవకాశాన్ని ఓటర్లు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

ఉప్పల్ టికెట్ ఇవ్వండి



ఉప్పల్: ఉప్పల్ అసెంబ్లీ నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ పార్టీ టికెట్ కోసం మాజీ కార్పొరేటర్ మందుముల పరమేశ్వర్‌రెడ్డి సోమవారం గాంధీ భవన్‌లో దరఖాస్తు చేసుకున్నారు. అనుచరులతో కలిసి ఉప్పల్ నుంచి పోటీ చేసే అవకాశం కల్పించాలని అధిష్టానాన్ని కోరినట్లు తెలిపారు.

విజ్ఞానం కోసమే విహార యాత్రలు


విహార యాత్రలో విద్యార్థులు

బోడుప్పల్: విహార యాత్రల వల్ల విద్యార్థులకు విజ్ఞానం పెరుగుతుందని విద్యాజ్యోతి ఉన్నత పాఠశాల డైరెక్టర్ శ్రావణ్‌కుమార్‌రెడ్డి అన్నారు. చెంగిచర్లలోని విద్యాజ్యోతి ఉన్నత పాఠశాల విద్యార్థులు విజ్ఞాన ప్రదర్శన నిమిత్తమై బిర్లా ప్లానిటోరియం, బిర్లా సైన్స్ మ్యూజియంను తిలకించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చదువు కోవడం కేవలం అచ్చు పుస్తకాల్లో కాకుండా ప్రాక్టికల్‌గా విజ్ఞానం పెరిగేందుకు ఈ యాత్రకు వెళ్లామన్నారు. చదివిన దాని కంటే చూసిన దృశ్యాలు, విషయాలు జీవిత కాలం గుర్తుంటాయన్నారు. ఈ విజ్ఞాన యాత్రలతో విద్యార్థులు విజ్ఞాన సముపార్జనకు అవధులు లేవని తెలుసుకున్నట్లు వెల్లడించారు. యాత్రలో డైరెక్టర్ అనిల్ అయ్యంగార్, ప్రిన్సిపాల్ నీలిమా, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నాణ్యమైన సేవలు అందించాలి



అల్వాల్: వినియోగదారులు నాణ్యమైన సేవలు అందించాలని అల్వాల్ డివిజన్ కార్పొరేటర్ చింతల శాంతి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. సోమవారం అల్వాల్‌లోని శ్రీబేకరి వద్ద నూతనంగా ఏర్పాటు చేసిన కనిష్క గోల్డ్ వరల్డ్‌ను ఆమె ప్రారంభించారు. కార్యక్రమంలో నాగేశ్వరావు, అరవింద్‌కుమార్, ప్రేమ్‌కుమార్, అశ్విన్‌కుమార్, కవిత, భవిత, శశికల, ఉదయ నిర్వాహకులు పాల్గొన్నారు.

జీహెచ్‌ఎంసీ ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు పర్మనెంట్ చేయాలి



మల్కాజిగిరి: జీహెచ్‌ఎంసీలో పనిచేస్తున్న ఔట్ సోర్సింగ్ కార్మికులను పర్మనెంట్ చేయాలని మల్కాజిగిరి కార్పొరేటర్ శ్రవణ్, మౌలాలి కార్పొరేటర్ సునీతాయాదవ్, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు నందికంటి శ్రీధర్ డిమాండ్ చేశారు. సోమవారం సర్కిల్ కార్యాలయం వద్ద నిర్వహించిన ధర్నాకు వారు మద్దతు పలికారు. వెంకటేష్‌యాదవ్, సానాది శంకర్, గుత్తి రాంచందర్, శ్రీనివాస్‌గౌడ్, రాములు, వినోద్‌యాదవ్, అలీ ఉన్నారు.



అల్వాల్: అల్వాల్ సర్కిల్ పరిధిలో విధులు నిర్వహిస్తున్న అవుట్ సోర్సింగ్ పారిశుద్ధ్య కార్మికులను పర్మినెంట్ చేయాలని ఏఐటీయూసీ అల్వాల్ పట్టణ సమితి ఆధ్వర్యంలో సోమవారం అల్వాల్ సర్కిల్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఔట్‌సోర్సింగ్ కార్మికులకు పర్మినెంట్ చేస్తామని సీఎం హామీ ఇచ్చి 9 ఏళ్లవుతున్నా ఇవ్వలేదన్నారు. అనంతరం అల్వాల్ ఉపకమిషనర్‌కు వినతి పత్రం అందజేశారు.

పారిశుద్ధ్య కార్మికులను మోసం చేసిన కేసీఆర్

ఉప్పల్: పారిశుద్ధ్య, జీహెచ్‌ఎంసీ అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల సమ్మెకు సోమవారం ఉప్పల్ నియోజకవర్గ కాంగ్రెస్ నేత రాగిడి లక్ష్మారెడ్డి మద్దతు తెలుపుతూ సమ్మెలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన వంటా వార్పులో ఆయన పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ అందరినీ మోసం చేసినట్లుగానే అవుట్ సోర్సింగ్, పారిశుద్ధ్య కార్మికులను సీఎం కేసీఆర్ మోసం చేసాడని విమర్శించారు. కాంగ్రెస్ నేత సుధాకర్ శెట్టి, మేడల మల్లికార్జున్ గౌడ్ ఉప్పల్ కాంగ్రెస్ నేతలు పాల్గొన్నారు.

అంబరాన్నంటిన సంబరాలు


సైనిక్‌పురిలోని కార్యాలయం వద్ద కార్యకర్తల సంబురాలు


మల్కాజిగిరి చౌరస్తాలో సంబరాలు

కాప్రా: ఉప్పల్ నియోజకవర్గ బీఆర్‌ఎస్ అభ్యర్థిగా బండారి లక్ష్మారెడ్డిని బీఆర్‌ఎస్ ప్రకటించడంతో కాప్రా డివిజన్ సైనిక్‌పురిలోని ఆయన కార్యాలయం వద్ద కార్యకర్తల సంబరాలు అంబరాన్నంటాయి. బీఆర్‌ఎస్ తొలి జాబితాలో లక్ష్మారెడ్డికి చోటుదక్కడంతో ఆయనకు శుభాకాంక్షలు తెలిపేందుకు కార్యకర్తలు, అనుచరులు, అభిమానులు పోటెత్తారు. పుష్పగుచ్ఛాలు, గజమాలతో ఆయనను సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. అభిమాన నాయకుడికి టికెట్ దక్కడంతో కార్యకర్తల్లో సంతోషం నెలకొంది. కార్యకర్తలతో కలిసి కాసేపు లక్ష్మారెడ్డి డ్యాన్స్ చేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు పన్నాల దేవేందర్‌రెడ్డి, శాంతి సాయిజెన్ శేఖర్, బీఆర్‌ఎస్ నాయకులు నీలం రెడ్డి, ఖైరి నవీన్‌గౌడ్, మహేష్‌గౌడ్, ఇందరా తదితరులు పాల్గొన్నారు.

అందరినీ కలుపుకుని ముందుకెళ్తా: బండారి లక్ష్మారెడ్డి

తనపై నమ్మకంతో ఉప్పల్ అభ్యర్థిగా ప్రకటించినందుకు సీఎం కేసీఆర్, మంత్రులు కేటీఆర్, హరీష్‌రావుకు కృతజ్ఞతలు తెలిపారు. బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ పిలుపుతో పార్టీలోకి వచ్చిన నాటి నుంచి పార్టీ ఆదేశానుసారం పార్టీ కోసం పని చేశానని తెలిపారు లక్ష్మారెడ్డి. గత ఎన్నికల్లో కూడా పార్టీ ఆదేశాలతో పార్టీ ప్రకటించిన అభ్యర్థి గెలుపు కోసం కృషి చేశానని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరినీ కలుపుకుని ముందుకెళ్తానని తెలిపారు. ప్రజల ఆశీర్వాదంతో ఉప్పల్ నియోజకవర్గంలో లక్ష మెజార్టీతో గులాబీ జెండా ఎగరేస్తానని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

మల్లాపూర్, నాచారంలో..

మల్లాపూర్: సీఎం కేసీఆర్ ఉప్పల్ బీఆర్‌ఎస్ అభ్యర్థిగా బండారి లక్ష్మారెడ్డిని ప్రకటిండంతో మల్లాపూర్‌లో బీఆర్‌ఎస్ నేతలు సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్, హరీశ్‌రావుల చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. మల్లాపూర్ కార్పొరేటర్ పన్నాల దేవేందర్‌రెడ్డి, కటార్ల భాస్కర్ పాల్గొన్నారు. జీహెచ్‌ఎంసీ స్టాండింగ్ కమిటీ సభ్యులు, నాచారం కార్పొరేటర్ శాంతి సాయిజెన్‌శేఖర్ ఆధ్వర్యంలో నాచారం వైజయంతి థియేటర్ వద్ద సంబరాలను జరుపుకున్నారు.

మల్కాజిగిరిలో పెద్దఎత్తున సంబరాలు

మల్కాజిగిరి: ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావుకు రెండవసారి అసెంబ్లీ టికెట్ కేటాయించడంతో మల్కాజిగిరిలో పార్టీ శ్రేణులు సంబురాలు జరుపుకున్నారు. సర్కిల్ అధ్యక్షుడు పిట్ల శ్రీనివాస్ ఆధ్వర్యంలో మల్కాజిగిరి చౌరస్తాలో బాణాసంచా కాల్చి, స్వీట్లు పంచిపెట్టారు. శ్రీనివాస్, నియోజకవర్గ అధికార ప్రతినిధి సతీష్‌కుమార్, మీడియా ప్రతినిధి గుండా నిరంజన్ , నాయకులు బద్దం పరశురామి రెడ్డి, రాముయాదవ్, ఉపేందర్‌రెడ్డి, సత్యమూర్తి, నర్సింగరావు, ఉపేందర్ పాల్గొన్నారు.


మల్లాపూర్ చౌరస్తాలో మల్లాపూర్ కార్పొరేటర్ దేవేందర్‌రెడ్డి, కటార్ల భాస్కర్


నాచారంలో కార్పొరేటర్ శాంతి సాయిజెన్‌శేఖర్ తదితరులు


ఉప్పల్ చౌరస్తాలో సంబురాలు

ఉప్పల్ నియోజకవర్గంలో ఓటర్లు వీరే..

ఉప్పల్: ఉప్పల్ నియోజకవర్గంలో కొత్తగా చేర్చిన ఓటర్లతో కలిపి 4,98,877 ఓటర్లు జాబితాలో ఉన్నట్లు అధికారులు సోమవారం ప్రకటించారు. అందులో 2,38,993 మహిళలు ఉండగా 2,59,850 పురుషులు ఉన్నట్లు తెలిపారు. వీటితో పాటు సర్కిళ్ల వారిగా కూడా ఓటరు లిస్టును ప్రకటించారు. కాప్రా సర్కిల్‌లో 236 పోలింగ్ స్టేషన్లు, ఉప్పల్ సర్కిల్ పరిధిలో 171 పోలింగ్ స్టేషన్లను ఖరారు చేశారు.

పెరిగిన పోలింగ్ స్టేషన్లు

ఉప్పల్ నియోజకవర్గ పరిధిలో 2018 ఓటర్ జాబితా ప్రకారం చూస్తే 26 పోలింగ్ స్టేషన్లు అదనంగా వచ్చాయి. ఉప్పల్ సర్కిల్ పరిధిలో 11 స్టేషన్లు అదనంగా రాగా కాప్రా సర్కిల్ పరిధిలో మరో 15 పోలింగ్ స్టేషన్లు అదనంగా వచ్చాయని, మొత్తం కలిపి 407 పోలింగ్ స్టేషన్లు ఉన్నాయని అధికారులు తెలిపారు.

పోచమ్మ ఆలయం నూతన కమిటీ ఎన్నిక



అల్వాల్: వెంకటాపురం పోచమ్మ దేవాలయం నూతన పాలకమండలిని సోమవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా ఎస్.వై.పద్మారావు, ప్రధాన కార్యదర్శిగా నిమ్మ అశోక్‌రెడ్డి, కోశాధికారిగా తాటికొండ పాండులు ఎన్నికయ్యారు. ఎన్నికల అధికారి నరసింహులు, ఎన్నికల ఇన్‌చార్జి టీఆర్ విట్టల్‌రావు ఉన్నారు.